# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 10 జూన్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## ఇందిరమ్మ ఇండ్లకు 98.64 కోట్లు విడుదల..

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇప్పటివరకు 388 ఇందిరమ్మ ఇండ్లకు స్లాబ్‌లు వేయగా, ప్రభుత్వం నుంచి లబ్ధిదారులకు రూ.98.64 కోట్లు విడుదల చేసినట్టు గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. 9,877 ఇండ్లకు పునాదులు పూర్తికాగా, 1,839 ఇండ్ల గోడల నిర్మాణం పూర్తయిందని ఆయన తెలిపారు. వారంవారం లబ్ధిదారులకు చెల్లింపుల్లో భాగం గా సోమవారం రూ. 22.64 కోట్లు విడుదల చేసిన ఆయన.. ఈ మేరకు ఇండ్ల నిర్మాణ పురోగతి వివరాలు వెల్లడించారు.





### మహారాష్ట్ర, సీడబ్ల్యూసీ

## అభ్యంతరాలతోనే రీడిజైన్

- కాళేశ్వరం తెలంగాణకు జీవధార
- ప్రతి ప్రశ్నకు ఆధారాలతో కూడిన సమాధానాలు సమర్పించాం
- మాజీమంత్రి హరీశ్‌రావు
- కాళేశ్వరం ముందు హాజరైన హరీశ్‌రావు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

మహారాష్ట్ర, సీడబ్ల్యూసీ అభ్యంతరాలతోనే కాళేశ్వరం ప్రాజెక్టుకు రీడిజైన్ చేయాల్సి వచ్చిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. కాళేశ్వరం ఎప్పటికైనా తెలంగాణకు జీవధార.. ఈ విషయం తెలంగాణ ప్రజలకు అర్థమైందని తెలిపారు. కాళేశ్వరం కమిషన్ ముందు ఏదీ నోటి మాటగా చెప్పలేదు. అన్నీ సాక్ష్యాధారాలతో సహా సమర్పించామని స్పష్టం చేశారు. క్యాబినెట్ నిర్ణయాలు, వాప్కోస్ రిపోర్టులు, సీడబ్ల్యూసీ లేఖలు అన్నీ సమర్పించినట్టు వివరిం చారు. సోమవారం కాళేశ్వరం కమిషన్ విచారణ ముగిసిన అనంతరం బీఆర్కే భవన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు.

కమిషన్ అడిగిన ప్రతి ప్రశ్నకు ఆధారాలతో కూడిన సమాధానాలు సమర్పించామని స్పష్టం చేశారు. తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతుల విషయంలో మహారాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం నిరాకరించిన నేపథ్యంలో, కేంద్ర జలసంస్థ వాప్కోస్, సీడబ్ల్యూసీ సూచనల మేరకు మేడిగడ్డను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. తమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేదని, ముంపు గ్రామాలు, వన్యప్రాణి అభయారణ్యాలు ఉన్నందున అనుమతులు సాధ్యం కాకపోవడం వల్లే లొకేషన్ మార్చినట్లు వివరించారు. ప్రాజెక్టు అమలు కోసం ఏర్పాటైన కాళేశ్వరం కార్పొరేషన్‌కు అన్ని అవసరమైన అనుమతులు ఉన్నట్లు స్పష్టంగా తెలిపారు. వాటికి సంబంధించిన ఆధారాలను కూడా కమిషన్‌కు సమర్పించామని తెలిపారు.

ఇది పూర్తిగా ఇంజనీరింగ్ నిర్ణయమేనని, సాంకేతిక విశ్లేషణల ఆధారంగా మార్పులు జరిగాయని వివరించారు. ప్రాజెక్టులో 141 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు నిర్మించామన్నారు. కాళేశ్వరంపై పిచ్చికూతలు కూస్తూ కూళేశ్వరం అని మాట్లాడుతున్నారనీ, కాళేశ్వరంలో 100 భాగాలు, అన్ని ఇంటెక్ట్ ఉన్నాయని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో 3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 19 సబ్ స్టేషన్లు, 21 పంప్ హౌస్‌లు, 203 కిలోమీటర్ల సొరంగాలు, 1531 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్స్,

మిగితా 2వ పేజీలో

## మహాలక్ష్మితో ఆర్టీసీకి లాభాలు

- రాష్ట్రంలో మహిళలకు రూ. 182 కోట్ల విలువైన జీరో టికెట్లు జారీ
- మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీకి రూ. 6,088 కోట్లు చెల్లించిన ప్రభుత్వం
- ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క
- సూర్యాపేట ఆర్టీసీ డిపోలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించిన ఉపముఖ్యమంత్రి



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ లాభాల బాటలో నడుస్తోందని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బస్ డిపోలో సోమవారం ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కాలుష్యం నుండి పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని వాతావరణాన్ని కాపాడుకుంటూ ఆర్‌టిసి సంస్థ ముందుకు వెళ్తోందని అన్నారు. పొన్నం ప్రభాకర్ రవాణా శాఖ మంత్రి అయినప్పటి నుండి ఆర్‌టిసిలో సమూల మార్పులు తెచ్చి అనేక సంస్కరణలతో ముందుకు వెళ్లడం శుభ పరిణామమని అన్నారు. గతంలో సామాన్యుడి అవసరాలు తీర్చేందుకు ఆర్‌టిసి సంస్థ ఎంతగానో కృషి చేసింది కానీ లాభాలు లేకుండా ఎప్పుడూ నష్టాల బాటలో కొనసాగిందని, కానీ ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఆర్‌టిసిని కాపాడుకునేందుకు, ఆర్థికంగా నిలబెట్టేదుకు తగిన చర్యలతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు.

పాత బస్సులు, డీజిల్ బస్సులను పక్కన పెట్టి ఎలక్ట్రిక్ బస్సుల ద్వారా వాతావరణాన్ని కాపాడుకుంటూ ప్రజలకు సేవ చేసేందుకు సూర్యాపేట డిపోకు 79 ఎలక్ట్రిక్ బస్సులు మంజూరయ్యాయని, సోమవారం 45 ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రంలో ఆడపడుచులు అందరూ ఆర్‌టిసి బస్సుల ద్వారా రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా వెళ్లేందుకు ఉచితంగా తీసుకెళ్తున్నామని, ఇప్పటివరకు రూ.182 కోట్ల జీరో టికెట్లు జారీ చేశామని, వాటి ద్వారా తెలంగాణ ఆడపడుచులు 6,088 కోట్ల రూపాయలు ఆదా చేసుకున్నారని అన్నారు. ఆ డబ్బులు ప్రభుత్వం ఆర్‌టిసికి నేరుగా జమ చేశామని, దానితో నేడు సంస్థ ఆర్థికంగా నిలదొక్కుకొని పూర్తి సామర్థ్యంతో రాష్ట్రమంతా బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. చుట్టూ సూర్యాపేట.. నడుమ నల్లగొండ అంటూ తెలంగాణ సాయుధ పోరాటం గుర్తు చేసుకుంటూ ప్రజా ప్రభుత్వంలో మారుతున్న కాలానికి అనుగుణంగా, కార్మికుల సంక్షేమం కోరుకుంటూ నేడు సూర్యాపేట డిపోనుండి హైదరాబాద్, నల్లగొండ, ఖమ్మం, వరంగల్, కోదాడ లాంటి ప్రాంతాలకి వాతావరణాన్ని కాపాడుకుంటూ 79 బస్సులు మంజూరు చేశామని తెలిపారు.

గత పదేళ్లలో ఒక్క నూతన బస్సు గానీ, కొత్త ఉద్యోగం గానీ ఇవ్వకుండా ఆర్‌టిసిని నష్టాల ఊబిలో కూరుకొనిపోయేలా చేశారని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి వేలాది కొత్త బస్సులు, ఉద్యోగాలు నియమించామని అన్నారు. ఆర్‌టిసిని పరిరక్షించుకుంటూ గ్రామాలకు రవాణా వ్యవస్థ చేరుకునేలా భవిష్యత్తులో కొత్త బస్సుల కొనుగోలుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలుష్యం నుండి వాతావరణాన్ని కాపాడుకునేందుకు కాలుష్య రహిత ఎలక్ట్రిక్ బస్సులను ఏర్పాటు ప్రోత్సహిస్తున్నాయని అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచితంగా సేవలు అందించి ఆర్థికంగా ఆడబిడ్డలకు అండగా ప్రభుత్వం ఉంటోందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, జిల్లా ఎస్‌పి నరసింహ, ఎంఎల్‌ఎలు పద్మావతి రెడ్డి, మందుల సామేలు, ఎంఎల్‌సి శంకర్ నాయక్, పర్యాటక సంస్థ ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొప్పుల వేణారెడ్డి, వైస్ ఛైర్మన్ శ్రీనివాస్, జేబీఎం సంస్థ ప్రతినిధి ప్రభాకర్, ఆర్‌టిసి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## టీపీసీసీ నూతన కార్యవర్గం ప్రకటన

- 27 మంది ఉపాధ్యక్షులు
- 69 మంది ప్రధాన కార్యదర్శులు నియామకం
- ఎంపీ, ఐదుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలు చోటు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) నూతన కార్యవర్గాన్ని ప్రకటించింది. ఈమేరకు కాంగ్రెస్ హైకమాండ్ టీపీసీసీ నూతన కార్యవర్గం జాబితాను విడుదల చేసింది. ఈ కార్యవర్గంలో 27 మంది ఉపాధ్యక్షులు, 69 మంది ప్రధాన కార్యదర్శులు ఎంపికయ్యారు. ఈసారి అన్ని వర్గాలనూ ప్రతినిధులుగా నిలబెట్టే విధంగా పార్టీ హైకమాండ్ సమతుల్యత పాటించింది. మహిళలు, యువజన నేతలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు తగిన ప్రాధాన్యం లభించింది. కార్యవర్గంలో ఎంపీ కె. రఘువీరారెడ్డి, ఐదుగురు ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, డా. చిక్కుడు వంశీకృష్ణ, వెడ్మ బొజ్జు, చ. పర్ణికా రెడ్డి, డా. మట్టా రాగమయి, ఇద్దరు ఎమ్మెల్సీలు బల్మూర్ వెంకట్, బసవరాజు సారయ్య లకు చోటు దక్కింది.

## బస్ పాస్ ఛార్జీలు పెంచిన ఆర్టీసీ




బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

: రాష్ట్ర వ్యాప్తంగా బస్ పాస్ ఛార్జీలను టీజీఎస్ఆర్టీసీ 20శాతం నుంచి 24శాతం వరకు పెంచింది. రూ.1,150 ఉన్న ఆర్డినరీ పాస్ రూ.1,400కు పెంచారు. రూ.1,300 ఉన్న మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్ పాస్ ధరను రూ.1,600కు పెంచారు. రూ.1,450 ఉన్న మెట్రో డీలక్స్ పాస్‌ను రూ.1,800కు పెంచారు. గ్రేటర్ హైదరాబాద్, గ్రీన్ మెట్రో ఏసీ బస్ పాస్ ధరలను ఆర్టీసీ పెంచింది. కొత్త ఛార్జీలు నేటి నుంచి అందుబాటులోకి వస్తాయని ఆర్టీసీ యాజమాన్యం వెల్లడించింది. సాధారణ ప్రజలతో పాటు స్టూడెంట్ బస్ పాస్ ధరలను కూడా టీజీఆర్టీసీ పెంచింది. పెంచిన బస్ పాస్ ధరలు తక్షణం అమల్లోకి రానున్నాయి.

రాష్ట్రంలో ఈ నెల 12న విద్యాసంస్థలు తెరవనున్న క్రమంలో విద్యార్థులకు కొత్తగా బస్సు పాస్‌లకు టీజీ ఆర్టీసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విద్యార్థులకు ఈ నెల 12 నుంచి కొత్త బస్ పాసుల ను జారీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లను చేస్తున్నారు. కొత్త బస్ పాస్ ల కోసం www.tgsrtc.telangana.gov.in/bus-pass-services వెబ్ సైట్లో అప్లై చేసుకోవాలని అధికారులు సూచించారు.గ్రేటర్‌లో 40 కేంద్రాల ద్వారా పాస్‌లు నగర వ్యాప్తంగా 40 ఆర్టీసీ కేంద్రాల్లో విద్యార్థులు ఈ బస్ పాస్‌లను పొందవచ్చని ఆర్టీసీ యాజమాన్యం తెలిపింది. అనంతరం అప్లికేషన్ ఫామ్‌ను తీసుకెళ్లి విద్యార్థులకు దగ్గరలో ఉన్న బస్ పాస్ కౌంటర్లలో ఇస్తే.. స్టూడెంట్ బస్ పాస్ జారీ అందజేస్తారని.. ఆర్టీసీ అధికారులు తెలిపారు. మహలక్ష్మి పథకం ఉన్నందున విద్యార్థినులు బస్ పాస్ తీసుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది.

## వరద ముప్పు ప్రాంతాల పరిశీలన



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ మాదాపూర్‌లోని వరద ముప్పు ప్రాంతాలను హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ సోమవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నాలాల్లో వరద సాఫీగా సాగుతుందా . ఎక్కడైనా ఆటంకాలున్నాయా అనే అంశాలను పరిశీలించారు. వర్షం పడితే నీట మునుగుతున్న నెక్టార్ గార్డెన్స్ పరిసరాలలో వర్షపు నీరు నిలవకుండా తీసుకోవాల్సిన చర్యలపై జీహెచ్ ఎంసీ, ఇరిగేషన్, జలమండలి అధికారులతో చర్చించారు. దుర్గం చెరువుకు ఎండాకాలంలో కూడా నీటి కొరత వుండదు కనుక.. వర్షాకాలంలో నీటి నిలువల స్థాయిని తగ్గిస్తే వరద పోటెత్తదని అధికారులు సూచించారు. వర్షం పడితే నడుములోతు నీళ్లు తమ కాలనీలో నిలబడుతున్నాయని స్థానికులు కమిషనర్ కు విన్నవించారు. దుర్గం చెరువుకు ఇన్ ఫ్లో , ఔట్‌ఫ్లో ఎంతనే అంశాలను చెరువు చుట్టూ తిరిగి పరిశీలించారు. చెరువులోపల తూములను, గేటులను తిలకించారు. ఇందులో ఏ గేటు ఎత్తితే ఎంత నీరు వెళుతుంది.. అనే అంశాల్ను అడిగి తెలుసుకున్నారు.

దుర్గం చెరువులో నీటిమట్టం నిర్ధారణకు ఇరిగేషన్, జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ నిర్ణయించారు. వరద కాలువలను విస్తరించాల్సిన అవసరం ఉన్నా.. వర్షాకాలంలో అయినా కొంతమేర తగ్గిస్తే మాదాపూర్ ప్రాంతంలో వరద ముప్పు తగ్గించడానికి వీలవుతుందా అనే విషయంపైన్న ఇందులో చర్చించనున్నారు. దుర్గం చెరువు దిగువ భాగంలో ఆక్రమణలతోపాటు.. వరద కాలువకు ఉన్న ఆటంకాలను కూడా కమిషనర్ పరిశీలించారు. దుర్గం చెరువులో ఇనార్బిట్ మాల్ వైపు మట్టి పోయడంపై విచారించారు. అక్కడ పార్కు చేసిన వాహనాలకు సంబంధించి వాకబు చేశారు. పూర్తి వివరాలు తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు. దుర్గం చెరువు వరద కాలువకు ఆటంకం లేకుండా ఎంత మొత్తం నీరు విడుదల చేసినా సాఫీగా మల్కం చెరువుకు చేరేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

## బీజేపీ స్కూల్ నుంచి డ్రాపౌట్ అయిన రేవంత్ రెడ్డి

- బీజేపీ ఎంపీ లక్ష్మణ్



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

సీఎం రేవంత్ బీజేపీ స్కూల్లో డ్రాపౌట్ స్టూడెంట్‌గా దారి తప్పారని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయం లో ఆయన మీడియాతో మాట్లాడు తూ.. బీజేపీ స్కూల్లో దేశం, జాతీయవాదం ఉంటాయని తెలిపారు. కానీ రేవంత్ వాటన్నింటిని ఎప్పుడో వదిలేశారని పేర్కొన్నారు. ఆయన తన పదవిని కాపాడుకోవడం కోసం నానా ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ముఖ్యమంత్రి పదవిని రాహుల్ గాంధీ దగ్గర తాకట్టు పెట్టారంటూ విమర్శించారు. రాహుల్ కోరిక మేరకే కులగణన, రిజర్వేషన్లు, మంత్రివర్గ విస్తరణ చేశారని.. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని రేవంత్‌రెడ్డి ఢిల్లీ నాయకులకు తాకట్టు పెట్టారని మండిపడ్డారు.

బీజేపీ కార్యాలయానికి ఎంతోమంది సమస్యలతో వస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో అవినీతి రాజ్యమేలుతున్నదని ఆరోపించారు. 11 ఏండ్ల మోడీ పాలనపై ఒక్క అవినీతి మరక అయినా ఉందా? అంటూ ప్రశ్నించారు. మోడీ పాలనకు కాంగ్రెస్ పాలనకు ఎంతో తేడా ఉందని పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను ప్రధాని మోదీ గాడిలో పెట్టారని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి మాటలు నమ్మి తెలంగాణ ప్రజలు మోసపోయారన్నారు.

## రోడ్డు ప్రమాదంలో 15 మంది విద్యార్థులు మృతి



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఉత్తర మలేసియాలో యూనివర్శిటీ విద్యార్థులను క్యాంపస్‌కు తీసుకెళ్తున్న బస్సు ఓ మినీ వ్యాన్‌ను ఢీకొట్టడంతో 15 మంది విద్యార్థులు మరణించగా, పలువురు గాయపడ్డారు. ఉత్తరమలేసియా లోని సుల్తాన్ ఇద్రిస్ ఎడ్యుకేషనల్ యూనివర్శిటీకి చెందిన బస్సు విద్యార్థులతో వెళ్తుండగా, అదుపు తప్పి ముందు వెళ్తున్న మినీ వ్యాన్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. దీంతో 13 మంది విద్యార్థులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు సహాయక బృందాలు వెంటనే అక్కడకు వెళ్లి 30 మందికి పైగా క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఇద్దరు విద్యార్థులు మరణించారు. ప్రస్తుతం ఏడుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. మృతుల్లో అందరూ 21 నుంచి 23 ఏళ్ల మధ్య ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు. మలేసియా ప్రధాన మంత్రి అన్వర్ ఇబ్రహీం ఈ ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున సహాయం చేయాలని ఉన్నత విద్యామంత్రిత్వశాఖను ఆదేశించారు.

## హైడ్రాకు వర్షాకాల నిర్వహణ బాధ్యతలు

- ఉత్తర్వులు జారీ చేసిన పురపాలకశాఖ

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

: గ్రేటర్ హైదరాబాద్‌లో వర్షాకాల సన్నద్ధతపై పురపాలకశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. వర్షాకాల నిర్వహణ బాధ్యతలను హైడ్రాకు అప్పగించింది. ఈ మేరకు పురపాలకశాఖ కమిషనర్ ఇలంబర్తి ఉత్తర్వులు జారీ చేశారు. వరద నీటి నిల్వ, నాలాల్లో పూడికతీత, రహదారులపై కూలిన చెట్ల, బురద తొలగింపు బాధ్యతలు హైడ్రాకు అప్పగించారు. విద్యుత్, జలమండలి శాఖల సమన్వయంతో పని చేయాలని హైడ్రాకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలంలో విపత్తు నిర్వహణ కార్యకలాపాలు పరిశీలించాలని జీహెచ్ఎంసీ, హైడ్రా కమిషనర్లకు సూచనలు చేశారు.

## ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడలేదు



- సిట్ ఎదుట ఎస్ఐబీ మాజీ ఐజీ ప్రభాకర్ రావు
- ఎనిమిదిన్నర గంటల పాటు సాగిన విచారణ
- 11న తిరిగి విచారణకు రావాలని సిట్ ఆదేశం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఫోన్ ట్యాపింగ్‌కు తాను పాల్పడలేదనీ, ట్యాపింగ్ చేయాలని కింది స్థాయి అధికారులకు ఆదేశాలివ్వలేదని ఎస్ఐబీ మాజీ ఐజీ ప్రభాకర్‌రావు స్పెషల్ టీం అధికారుల ఎదుట వాదించారు. సిట్ అధికారులు వేసిన పలు ప్రశ్నలకు ఆయన ఎదురు ప్రశ్నలు వేసి దర్యాప్తు అధికారులను విస్మయ పర్చారు. సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడైన ప్రభాకర్ రావు సోమవారం సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. 14 నెలల తర్వాత ఆయన అమెరికా నుంచి ఆదివారం రాత్రి హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన విషయం తెలిసిందే. సుప్రీం ఆదేశాల మేరకు విచారణకు హాజరై ఆయనను స్పెషల్ టీం అధికారులు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8.30 వరకు సుదీర్ఘంగా ప్రశ్నించారు. పశ్చిమ మండల డీసీపీ విజయకుమార్ స్వీయ పర్యవేక్షణలో సిట్ ఏసీపీ వెంకటగిరితో పాటు మరో నలుగురు అధికారులు ఆయనను విచారించారు. విచారణ ప్రారంభమైనప్పటి నుంచి దాదాపు రెండు గంటల పాటు ఫోన్ ట్యాపింగ్‌లో ప్రభాకర్‌రావుపై వచ్చిన ఆరోపణలపై

మిగితా 2వ పేజీలో

## శాఖల పునర్వ్యవస్థపై ఢిల్లీ తీర్పు..?

- సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనతో రాజకీయ వేడి
- మంత్రుల బాధ్యతల్లో కీలక మార్పులు?
- ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్‌తో సీఎం భేటీ
- నేడు ఖర్గేతో భేటీ కానున్న సీఎం



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అకస్మాత్తుగా ఢిల్లీకి వెళ్లడంతో మంత్రుల శాఖల పునర్వ్యవస్థపై ఊహాగానాలు మళ్లీ ఊపందుకున్నాయి. ఆదివారం ముగిసిన మంత్రుల విస్తరణ అనంతరం కొత్తగా నియమితులైన ముగ్గురు మంత్రులకు శాఖలు కేటాయించకపోవడమే ఈ ఊహాగానాలకు కారణం మొదట సోమవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో రేవంత్ రెడ్డి భేటీ కావాల్సి ఉన్నప్పటికీ, ఈ సమావేశం మంగళవారం ఉదయానికి వాయిదా పడింది. అయితే, సోమవారం ఆయన ఏఐసీసీ జనరల్ సెక్రటరీ (ఆర్గనైజేషన్) కే.సీ. వేణుగోపాల్‌తో ఒక గంట పాటు సమావేశమయ్యారు.

పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, మంత్రుల శాఖల తుది కేటాయింపుపై ఖర్గేతో రేవంత్ రెడ్డి జరిపే సమావేశంలో తుదితీర్మానం తీసుకునే అవకాశముంది. రేవంత్ రెడ్డి – వేణుగోపాల్ సమావేశంలో శాఖల పంపకంపై ఒక సమగ్ర అంగీకారం కుదిరినట్లు సమాచారం. ఈ అంగీకారానికి ఖర్గే సమక్షంలో అధికారిక ముద్ర పడనుంది.

### సీనియర్ మంత్రుల బాధ్యతలలో మార్పులు

పలు కీలక మంత్రులు ప్రస్తుతం రెండో మూడో శాఖలను నిర్వహిస్తున్నారు. వారిపై ఉన్న పనిభారం తగ్గించేందుకు ఈ పునర్వ్యవస్థ చేసే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తానే స్వయంగా హోం, విద్య, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్ వంటి కీలక శాఖలను నిర్వహిస్తున్నారు. శాఖల పునర్వ్యవస్థతో పాటు, మిగిలిన మూడు మంత్రుల పదవులను కూడా వెంటనే భర్తీ చేయాలని రేవంత్ రెడ్డి అధిష్టానాన్ని కోరినట్లు సమాచారం. ఆదివారం జరిగిన మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కని సీనియర్ నేతలకు తగిన పరిహారం ఇవ్వాలన్న ఉద్దేశంతో ఈ ప్రతిపాదన చేసినట్టు తెలిసింది.

అలాగే రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పోస్టుల నియామకాలలో కూడా వర్గీయ, రాజకీయ మరియు ప్రాంతీయ సమీకరణాల కారణంగా చోటు దక్కని నేతలను భాగస్వామ్యం చేయాలని రేవంత్ అధిష్టానాన్ని కోరినట్టు సమాచారం. ఈ అంశాలన్నింటిపై మంగళవారం ఖర్గేతో జరగనున్న కీలక సమావేశంలో తుది నిర్ణయం వెలువడే అవకాశముంది.

# మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యం

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద మహిళలను కోటీశ్వరులను చేయాలని ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల మహిళా సంఘాలకు అప్పగించామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేటాయించడం పై మహిళా సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.. ముందుగా జిల్లా కలెక్టర్ ను మహిళా సంఘాల సభ్యులు శాలువా, మొమెంటో తో సన్మానించారు.అనంతరం విజయవంతంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహించిన మహిళా సంఘాల సభ్యులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అభినందించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో 42 కొనుగోలు కేంద్రాల మాత్రమే మహిళా సంఘాల నిర్వహించేవారని, తాను కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత యాసంగి కోనుగోలు సీజన్ నందు అత్యధికంగా 190 కోనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించడం జరిగిందని, చాలా మంది అంచనాలకు విరుద్ధంగా మహిళా సంఘాల విజయవంతంగా యాసంగి కొనుగోలు ప్రక్రియ చేపట్టారని అన్నారు. యాసంగి సీజన్ లో మహిళలకు దాదాపు 7 కోట్ల రూపాయల కార్పస్ ఫండ్ వచ్చిందని, ఈ నిధులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.





రాబోయే ధాన్యం కొనుగోలు సీజన్ నందు మహిళా సంఘాలకు 220 కంటే ఎక్కువ కోనుగోలు కేంద్రాల అప్పగిస్తామని అన్నారు. రవాణా, హామాలీ సమస్య పరిష్కారం కోసం మహిళలు ముందస్తుగా ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు యాసంగి సీజన్ నందు మహిళా సంఘాలతో ఎటువంటి సమస్య రాలేదని, భవిష్యత్తులో కూడా ఇదే పని తీరు కోనసాగించాలని అన్నారు. మహిళలకు విత్తనాలు, ఎరువుల లైసెన్స్ కూడా అందిస్తామని అన్నారు. ప్రతి మండలం లో కనీసం 2 విత్తనాలు ఎరువులు షాపులను మహిళలకు కేటాయించాలని లక్ష్యంతో ఉన్నామని, మహిళా సంఘంలో అర్హులై ఉండి ఎవరికైనా ఆసక్తి ఉంటే దరఖాస్తు చేసుకోవా లని సూచించారు.

మహిళా సంఘాల సభ్యులు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా 192 ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకు కేటాయించడం వల్ల అధికంగా కమిషన్ లభించిందని, జిల్లా కలెక్టర్ తమ పై పెట్టిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తూ విజయవంతంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసామని అన్నారు. మహిళా సంఘాలపై నమ్మకంతో 190 కొనుగోలు కేంద్రాలు కేటాయించినందుకు జిల్లా కలెక్టర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం వివిధ సమస్యల పై కలెక్టరేట్ కు వచ్చే ప్రజలకు సౌకర్యార్థం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద సమీకృత జిల్లా కార్యాలయ సమావేశం మందిరం ఆవరణలో శ్రీ రాజ రాజేశ్వర మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన జిరాక్స్ సెంటర్ ను కలెక్టర్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఓ. శేషాద్రి, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ రజిత, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జలి బేగం, అదనపు డి.ఆర్.డి.ఓ. శ్రీనివాస్, సంబంధిత అధికారులు , సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం బడుల్లో ఆటపాటలతో ఒత్తిడి లేని బోధన

**బలగం టీవీ, సిరిసిల్ల**

ప్రభుత్వం బడుల్లో ఆటపాటలతో ఒత్తిడి లేని బోధన ఉంటుందని సిరిసిల్ల మండల విద్యాధికారి దూస రఘుపతి అన్నారు. సోమవారం పెద్దూరు లో ఎంపి హెచ్ఎస్ పెద్దూరు ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాల్లో భాగంగా గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చక్రవర్తుల రమాదేవి, ఏపీపీసీ చైర్పర్సన్ తిప్పవరం సుధా, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లకావత్ మోతిలాల్ ,చెన్నమనేని కీర్తి కమలాకర్ రావు మరియు లింగంపల్లి సత్యనారాయణ, తమ్మటి జీవన్, మంగ ప్రశాంత్ , బడుగు భరత్, టీచర్లు సుప్రజ ,సుమన్, గుండెల్లి రవీందర్ ,తోట శ్రీనివాస్, భాగ్యనగర్ మాధవి ,లకావత్ ఉమా, బైరి వాణిశ్రీ , కదర్ల కల్పన ,నాగుల వీణ, నందాల శంకర్, రాజమల్లు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.






ఇల్లంతకుంట మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కందికట్కూర్ ఎస్సీ కాలనీ నందు"ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం" లో భాగంగా...పాఠశాలలో విద్యార్థుల నమోదును పెంచేందుకు కాలనీ వీధుల్లో వినూత్న ప్రయత్నం గా బడిబాట-డప్పుల దండోర"నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో ఇల్లంతకుంట మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్,అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ నిర్మల , మాజీ సర్పంచ్ ముత్యం అమర్ గౌడ్ , ప్రధానోపాధ్యాయులు బద్దం రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు అనువోజు రాజు, అంగన్వాడి టీచర్ లక్ష్మి,గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బిగుల్ల విజయ్, న్యాత తిరుపతి , న్యాత అశోక్ , స్వామి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలి

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ప్రజావాణిలో వచ్చే అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియం లో ప్రజావాణి నిర్వహించి, ప్రజల నుంచి దరఖాస్తులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అర్జీలు తీసుకుని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 134 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.ఇక్కడ సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ శేషాద్రి, ఆయా శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.





# సీఎంఆర్ఎఫ్ పేదలకు గొప్ప వరం

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, సిరిసిల్ల**

సీఎంఆర్ఎఫ్ పథకం పేద ప్రజలకు గొప్ప వరమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.. కోనరావుపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అర్హులైన 56 మంది లబ్దదారులకు 18 లక్షల 37 వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు..ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణ రాష్టం మెడికల్ హబ్‌గా మారిందని అన్నారు. వైద్యారోగ్య రంగంలో తెలంగాణ రాష్టం సాధిస్తున్న ప్రగతి, ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా మారిందని రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టగానే రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచి ప్రజా ఆరోగ్య భద్రతపై ప్రభుత్వానికున్న చిత్తశుద్ధిని చాటుకున్నారని అన్నారు.మన ప్రాంతంలో వివిధ ఆరోగ్య సమస్యలతో చికిత్స తీసుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వార, ఎల్ఓసి ల ద్వారా ఇప్పటి వరకు 20 కొట్లు పై చిలుకు మంజూరు చేయడం జరిగిందనిఅన్నారు.. పేదలకు వైద్య పరంగా ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు..గత ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 10 సంవత్సరాలలో 400 కోట్లు పంపిణీ చేస్తే ప్రజా ప్రభుత్వ ఏర్పడిన నాటినుండి నేటి వరకు 800 కోట్ల మేర లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగింది అన్నారు.



# .ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజా పాలన..

**-మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్ జె టోనీ**

**బలగం టీవీ,తంగళ్ళపల్లి**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల సొంతింటి కలను నిజం చేస్తున్న ఘనత సీఎం రేవంత్ రెడ్డి కె దక్కుతుందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్ జె టోనీ అన్నారు..తంగళ్ళపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ముగ్గు పోసి అధికారులు, నాయకులు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిన జిల్లా ఇంచార్జ్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,పొన్నం ప్రభాకర్,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కేకే మహేందర్ రెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం చేసారు. అనంతరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్ జె టోనీ మాట్లాడుతూఇంటి నిర్మాణంలో పూర్తి సహకారం ప్రభుత్వం అందిస్తోందని, నిర్మాణాలకు ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తామని అన్నారు.లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను చేపట్టి పనులను వేగవంతం చేసి ఇందిరమ్మ ఇంటి కలను సాకారం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎ ఎం సి వైస్ చైర్మన్ నేరెళ్ల నరసింహ గౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు,రాపెల్లి ఆనందం,లింగాల భూపతి,సుద్దాల శ్రీనివాస్,మాజీ సర్పంచ్ ఆసానీ సత్యనారాయణ రెడ్డి,సామల గణేష్,సుద్దాల కరుణాకర్ గౌడ్,కొడం రమేష్, హనుమ0త రెడ్డి,భాస్కర్ రెడ్డి,కిన్నెర నాగేంద్రం, మచ్చ జలెందర్ తదితరులు పాల్గొన్నారు.




# వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇచ్చి మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**-చొక్కాల రాము ముదిరాజ్**

**బలగం టీవీ, సిరిసిల్ల**

వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇచ్చి,ముదిరాజులకు ఇచ్చిన మాట ను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని, రాజన్న సిరిసిల్ల జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చొక్కాల రాము ముదిరాజ్ అన్నారు.సోమవారం సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం లో చొక్కాల రాము ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్టంలో 42 శాతం ముదిరాజులు ఉన్నారని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ, సర్పంచ్, జడ్పిటిసి మరియు జడ్పీ చైర్మన్ స్థానాలను కూడా ముదిరాజులకు కేటాయించాలని అన్నారు. బీసీడీఈ లో ఉన్న ముదిరాజులను బీసీ ఏలోకి మార్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు మంత్రి పదవి ఇవ్వాలని అన్నారు.వాకిటి శ్రీహరి కి మంత్రి పదవి ఇచ్చినందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు పంబాల దేవరాజు సంయుక్త కార్యదర్శి జంగాపల్లి శేఖర్,రాయిని ప్రతాప్, సిరిసిల్ల టౌన్ అధ్యక్షుడు వంకాయల కార్తీక్,కోలా నరేష్, మామిండ్ల నారాయణ మునిగల రాజు చుక్క శేఖర్ బల్లెపు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# 'ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్'లో ధోనీ

**బలగం టీవీ, హైదరాబాద్**




భారత మాజీ క్రికెటర్ ఎంఎస్ ధోనీకి మరో గౌరవం లభించింది. దేశానికి మూడు ఐసీసీ ట్రోఫీలు అందించిన ఆయనకు 'ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్'లో చోటు లభించింది. అతడితోపాటు మరో ఆరుగురు కూడా ఈ జాబితాలో ఉన్నారు. సోమవారం ఐసీసీ సెలెక్ట్ చేసిన వాళ్లలో ఐదుగురు పురుష క్రికెటర్లు, ఇద్దరు మహిళా క్రికెటర్లను హాల్ ఆఫ్ ఫేమ్‌కు ఎంపిక చేసింది. ధోనీ సారథ్యంలో భారత జట్టు 2007 టీ20 వరల్డ్ కప్ విజేతగా నిలిచింది. అనంతరం సొంతగడ్డపై 2011లో వన్డే వరల్డ్ కప్, 2013లో ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా ఛాంపియన్‌గా అవతరించింది. ధోనీతో పాటు ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కించుకున్నవాళ్లలో ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ మాథ్యూ హేడెన్, దక్షిణాఫ్రికా మాజీ సారథి గ్రేమ్ స్మిత్, మిడిలార్డర్ బ్యాటర్ హాషీం అమ్లా, న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ డానియల్ వెటోరీలు ఉన్నారు. మహిళా క్రికెట్‌లో అంతర్జాతీయంగా రాణించిన ఇంగ్లండ్ వికెట్ కీపర్, బ్యాటర్ అయిన సారా టేలర్, పాకిస్థాన్ మహిళా క్రికెటర్ సనా మిర్ లు ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లో ఉన్నారు. పాక్ తరపున ఈ గౌరవం అందుకున్న తొలి మహిళ సనానే కావడం విశేషం.


# హైకోర్టును ఆశ్రయించిన ఆర్సీబీ

**బలగం టీవీ, హైదరాబాద్**

బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాటలో 11 మంది మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ ఘటనతో ఆర్సీబీపై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ డీఎన్ఏ ఎంటర్టైన్మెంట్‌ను బాధ్యులుగా పేర్కొంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు యాజమాన్యం తమపై ఉన్న కేసును కొట్టివేయాలని సోమవారం కర్ణాటక హైకోర్టును ఆశ్రయించింది. తమపై తప్పుడు కేసులో ఇరికించారని ఆర్సీబీ, రాయల్ ఛాలెంజర్స్ స్పోర్ట్స్ లిమిటెడ్ తరపు న్యాయవాది వాదించారు.

# మరోసారి ఆంధ్రా ఉమెన్స్ టీ20 లీగ్

**బలగం టీవీ, హైదరాబాద్**




ఆంధ్ర క్రికెట్ సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. మహిళా క్రికెట్ అభ్యున్నతి కోసం మరోసారి ఆంధ్రా ఉమెన్స్ టీ20 లీగ్ నిర్వహించాలని సంకల్పించింది. ఆదివారం విజయవాడలో జరిగిన వార్షిక సమావేశంలో ఏసీఏ ప్రతినిధులు ఈ తీర్మానానికి వచ్చారు. ఇప్పటికే ఆరు పురుషుల జట్లతో ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌ను నిర్వహిస్తోంది ఏసీఏ. ఈ లీగ్ విజయవంతం కావడంతో మహిళా క్రికెటర్ల నైపుణ్యాలు మెరుగపరచడంతో పాటు వాళ్లకు జాతీయ జట్టుకు ఎంపికయ్యేలా చేయాలని ఏసీఏ లక్ష్యంగా పెట్టుకుంది. ఇంతకుముందు మహిళా క్రికెటర్లతో ఆంధ్రా ఉమెన్స్ టీ20 లీగ్‌ను నిర్వహించిన అనుభవమూ అసోసియేషన్‌కు ఉంది. మూడు జట్లు తలపడే ఈ టోర్నీ నిరుడు అర్ధాంతరంగా వాయిదా పడింది. అయితే.. ఈ ఏడాది మరొక జట్టును చేర్చి.. మొత్తంగా 4 టీమ్స్‌తో లీగ్‌ను జరపాలనే ఉద్దేశంతో ఉన్నారు.

'మహిళా క్రికెటర్ల కోసం ఐపీఎల్ తరహాలో టీ20 లీగ్ జరపాలనే నిర్ణయం రాష్ట్రంలో మహిళల క్రికెట్ అభ్యున్నతి ఏసీఏ కృషికి నిదర్శనం కానుంది. ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్(విజయవాడ ఎంపీ), కార్యదర్శి ఎస్ సతీశ్ మహిళా క్రికెట్ పురోగతికి కట్టుబడి ఉన్నారు' అని సోమవారం ఆంధ్రా క్రికెట్ సంఘం అధికారి ఒకరు వెల్లడించారు. ఆగస్టులో మహిళల టీ20 లీగ్ నిర్వహణకు సన్నాహకాలు చేస్తున్నామని ఏసీఏ వర్గాలు తెలిపాయి.

# రేపే తమ్ముడు ట్రైలర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**




నితిన్ కథానాయకుడిగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'తమ్ముడు'. లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రధారులు. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం జూలై 4న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నెల 11న సాయంత్రం 5గంటలకు ఈ సినిమా ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా 'తమ్ముడు' మూవీ ట్రైలర్ రిలీజ్ అనౌన్స్‌మెంట్ వీడియోను ఫన్నీగా మేకర్స్ డిజైన్ చేశారు. లయ, వర్ష బొల్లమ్మ, స్వసిక విజయన్, సప్తమి గౌడ, బేబీ శ్రీరామ్‌ఆదిత్య అందరూ కలిసి ఈ సినిమా ట్రైలర్ రిలీజ్‌కే తామంటే తామే కారణమని గొడవ పడుతుండగా.. దర్శకుడు శ్రీరామ్ వేణు వచ్చి 'మీ డౌట్స్ అన్నీ క్లారిఫై కావాలంటే ముందు ట్రైలర్ చూడండి..' అని చెప్తాడు.

# ఇంగ్లండ్ లయన్స్ భారత్ 'ఏ' మ్యాచ్ డ్రా

**బలగం టీవీ, హైదరాబాద్**



ఇంగ్లండ్ లయన్స్ భారత్ మధ్య జరుగుతున్న రెండో అనధికారిక టెసు డ్రా గా ముగిసింది. అయితే ఈ మ్యాచ్‌లో భారత్ 'ఏ' జట్టు అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. టీమిండియా తమ సెకెండ్ ఇన్నింగ్స్‌ను 417/7 వద్ద డిక్లేర్ చేసింది. 163/4 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన భారత్–ఎ.. అదనంగా 254 పరుగులు జోడించింది.

తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ హీరో కేఎల్ రాహుల్ (51) రెండో ఇన్నింగ్స్‌లో అర్ధ సెంచరీతో ఆకట్టుకున్నాడు. జైస్వాల్ (5) మరోసారి నిరాశపరిచినా కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ (80)తో కలిసి రాహుల్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. ధ్రువ్ జురెల్ (28) ఫర్వాలేదనిపించగా.. నితీశ్ కుమార్ రెడ్డి (42), శార్దూల్ ఠాకూర్ (34) మెరిశారు. ఇక లోయరార్డర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన తనుష్ కొటియాన్ (108 బంతుల్లో 90 నాటౌట్, 10 ఫోర్లు, 1 సిక్స్), అన్షుల్ కంబోజ్ (51 నాటౌట్) అద్భుతంగా ఆడారు. దాంతో భారత ఆధిక్యాన్ని 400 పరుగుల మార్కును దాటించారు. టీ విరామ సమయానికి భారత కెప్టెన్ ఈశ్వరన్ ఇన్నింగ్స్‌ను 417/7 వద్ద డిక్లేర్ చేశాడు. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో లభించిన ఆధిక్యాన్ని కలుపుకుని ఇంగ్లండ్ లయన్స్ ముందు 439 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత జట్టు ఉంచింది. ఇంగ్లండ్ లయన్స్ బౌలర్లలో జార్జ్ హిల్ మూడు వికెట్లు పడగొట్టగా.. క్రిస్ వోక్స్, జాక్ తలా రెండు వికెట్లు సాధించారు.

439 పరుగుల ఛేదనలో బరిలోకి దిగిన ఇంగ్లండ్ లయన్స్.. 11 ఓవర్లు బ్యాటింగ్ చేసి 32 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయింది. మరో గంట ఆట మిగిలున్నా ఇరుజట్ల సారథుల అంగీకారంతో మ్యాచ్‌ను డ్రాగా ముగించారు. రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేస్తూ అదరగొట్టిన అన్షుల్.. బంతితోనూ రెండు వికెట్లు పడగొట్టాడు.

# స్వదేశీ టెస్టుల షెడ్యూల్‌లో మార్పులు.

**బలగం టీవీ, హైదరాబాద్**




బీసీసీఐ 2025 అంతర్జాతీయ క్రికెట్ క్యాలెండర్‌లో భాగంగా స్వదేశంలో జరగనున్న కొన్ని టెస్ట్ మ్యాచ్‌ల వేదికల్లో మార్పులు చేసింది. ఈ మేరకు సోమవారం ప్రకటించింది. దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ జట్లతో జరగబోయే ఈ టెస్ట్ మ్యాచ్‌ల షెడ్యూల్‌ను మార్చింది. మ్యాచ్‌ల నిర్వహణకు మెరుగైన పరిస్థితులు కల్పించడం, ప్రేక్షకులకు మంచి అనుభూతిని అందించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీసీసీఐ స్పష్టం చేసింది.

2025 నవంబర్ 14న న్యూఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరగాల్సిన భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య తొలి టెస్ట్ మ్యాచ్‌ను కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌కు మార్చారు. అలాగే వెస్టిండీస్‌తో జరగాల్సిన రెండో టెస్ట్ మ్యాచ్‌కు ముందుగా కోల్‌కతాను వేదికగా నిర్ణయించగా, తాజా మార్పులతో ఆ మ్యాచ్‌ను న్యూఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియానికి మార్చారు. వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్ అక్టోబర్ 2న అహ్మదాబాద్‌లో ప్రారంభం కానుంది.

పురుషుల మ్యాచ్‌లతో పాటు భారత్, ఆస్ట్రేలియా మహిళల జట్ల మధ్య జరగాల్సిన వన్డే సిరీస్ వేదికల్లో కూడా మార్పులు చోటుచేసుకున్నాయి. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా స్వదేశంలో ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో అమీతుమీ తేల్చుకోనుంది. ఇంతకుముందు ఈ మూడు వన్డేల సిరీస్‌ను చెన్నైలోని చిదంబరం స్టేడియంలో నిర్వహించాలనుకున్నారు. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరుగుతున్న పునరుద్ధరణ పనుల కారణంగా తొలి రెండు వన్డేలు న్యూ చండీగఢ్‌లోని న్యూ పీసీఏ స్టేడియంలో జరగనుండగా, చివరి మ్యాచ్ ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియానికి మారింది.

భారత 'ఏ' జట్టుతో దక్షిణాఫ్రికా 'ఏ' జట్టు మ్యాచ్‌ల వేదిక కూడా మారింది. నవంబర్ 13 నుంచి మూడు వన్డే మ్యాచులకు చిన్నస్వామి స్టేడియం ఆతిథ్యం ఇవ్వాల్సింది. అయితే.. ఈ మైదానం బదులు రాజ్‌కోట్‌లో సఫారీ ఏ జట్టుతో భారత కుర్రజట్టు తలపడనుంది.

# అఖండ తాండవం టీజర్ అదిరింది

**బలగం టీవీ, హైదరాబాద్**




నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను దర్శకత్వంలో వస్తోన్న నాలుగో చిత్రం అఖండ – 2: తాండవం. దీనికి ముందు వచ్చిన అఖండ చిత్రం ఎంతగా హిట్ అయిందో తెలిసిందే. దానికి కొనసాగింపుగా అంతకు మించి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందుతోంది. బాలయ్య పుట్టిన రోజు సందర్భంగా విడుదల తేదినీ ప్రకటిస్తూ టీజర్‌ను విడుదల చేశారు. 'నా శివుడు అనుమతి లేనిది ఆ యముడైన కన్నెతి చూడడు.. నువ్వు చూస్తావా? 'అంటూ బాలయ్య టీజర్‌లో చెప్పిన డైలాగ్‌లు ఆకట్టుకుంటున్నాయి. ఈ చిత్రాన్ని దసరా కానుకగా సెప్టెంబర్ 25న విడుదల చేయనున్నారు. 'వేదం చదివిన శరభం యుద్ధానికి దిగింది..' అనే సంభాషణతో ముగిసిన టీజర్ అభిమానులకు కావాల్సినంత థ్రిల్‌ను పంచింది. దర్శకుడు బోయపాటి శ్రీను యూనిక్ మేకింగ్, బాలకృష్ణ హై ఇంటెన్సిటీ పర్‌ఫార్మెన్స్, కైలాసగిరి నేపథ్య విజువల్స్ టీజర్‌పై అంచనాలు పెంచాయి. తమన్ అందించిన నేపథ్య సంగీతం టీజర్‌కు ప్రాణం పోసిందని, గూస్‌బంప్స్ తెప్పించేలా ఉందని పలువురు ప్రశంసిస్తున్నారు. బాలకృష్ణ చెప్పిన సంభాషణలు, టీజర్‌లోని విజువల్స్ సినిమాపై అంచనాలనుపెంచాయి. సంయుక్త, ఆది పినిశెట్టి కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# 'చండీ దుర్గమా' షూటింగ్ ప్రారంభం



'చండీ దుర్గమా' చిత్రం షూటింగ్ సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. హెచ్‌బీజే క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి మైనుఖాన్ ఎండీ దర్శకుడు. ముహూర్తపు సన్నివేశానికి హాస్య నటుడు అలీ క్లాప్‌నిచ్చారు. ఈ సందర్భంగా దర్శకుడు మైనుఖాన్ ఎండీ మాట్లాడుతూ.. ఇటీవలకాలంలో అమ్మవారి నేపథ్యంలో సినిమాలు రావడం లేదని, ఈ తరం ప్రేక్షకులు నచ్చేలా సరికొత్త కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామని, డార్క్ థీమ్ జోనర్‌లో సరికొత్త స్క్రీన్‌ప్లేతో ఆకట్టుకుంటుందని తెలిపారు. త్వరలో నటీనటులను ప్రకటించనున్న ఈ చిత్రానికి కెమెరా: వైఎస్ కృష్ణ, సంగీతం: ఎంకే, నిర్మాత: జయశ్రీ వెల్ది, రచన–దర్శకత్వం: మైనుఖాన్ ఎండీ.